# ఆకాశవాణిలో పింగళివారి వాణి

శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావు

సాహిత్య కళాసంపదలో లబ్ధ ప్రతిష్ఠులై సర్వులకూ గురుస్థానీయులైన పెద్దలను గురించి వ్రాయడం ఆప్తులూ, సన్నిహితులూ, తదభిమానపాత్రులూ అయిన శిష్యులకు అలవోకగా చేయతగ్గ పని అనిపించడం సహజం. అయితే, అటువంటి సాన్నిహిత్యం గల గురుశిష్యు లిద్దరూ ఆకాశవాణి వంటి సంస్థలో ఒకే శాఖలో కొన్ని ఏళ్ళపాటు పని చేయడం చాలా అపురూప విషయం ఆ సేవలో గురువుగారి పాలు ఇది అని శిష్యుడు ఇప్పుడు వ్రాయవలసి ఉంది. ఇది నిష్కర్షగా, నిర్మమంగా చెయ్యవలసిన పని. ఇది చదివే అందరకూ ఆమోదయోగ్యంగా ఉండేటట్లు వ్రాయడం కష్టం. ఈ కష్టం వల్లనే ఇది వ్రాయడం ఆలస్యం అయి, గురువుగారి దివ్యస్మృతి సంచిక అనుకొన్న దానికంటె ఆలస్యంగా వెలువడ వలసి వచ్చింది.

శ్రీ లక్ష్మీకాంతంగారు ఆంధ్రవిశ్వవిద్యాలయంలో రిటైర్ అయాక ఒకసారి మద్రాసు వచ్చి, తమ బావమరుదులయిన మోచర్ల వారింట్లో బస చేశారు. కేస్కర్ గారు కేంద్ర సమాచార ప్రసారశాఖ' మంత్రిగా ఉండినప్పుడు ఆకాశవాణిలో సంగీత సాహిత్యాది శాఖలలో బహుముఖ కృషి చేసిన లబ్ధ ప్రతిష్ఠులను కార్యక్రమ ప్రయోక్తలుగా చేర్చాలని ఒక నిర్ణయం తీసుకున్న సమయం అది. ఉత్తరాది కేంద్రాలలో అప్పటి కప్పుడే కొన్ని అటువంటి నియామకాలు జరిగిపోయాయి. దక్షిణరేడియో కేంద్రాలలో కూడ సంగీత నిర్వహణ ప్రయోక్తలను నియమించారు. ప్రసంగాల శాఖకుకూడా అటువంటి నియామకాలు చేయదలచుకుని, విజయవాడ కేంద్రానికి లక్ష్మీకాంతం గారిని ప్రయోక్తగా నియమించాలనే ఉద్దేశ్యం, దానికి తగిన ఆహ్వానమూ మద్రాసుకేంద్ర అధికారులకు ఢిల్లీ నుంచి వచ్చింది. నేను అప్పుడు మద్రాసు కేంద్రంలోనే ఉన్నాను. ఇటువంటి ఆహ్వానాన్ని వారు ఒప్పుకోనంతటి స్వాభిమానియేమో అనే భయం కూడా ఆనాడు అధికార వర్గంలో ఉండక పోలేదు. అందుకనే వారి అభిమాన శిష్యుడినైన నన్ను ఆ వర్తమానంతో గురువుగారి దగ్గరకు రాయబారం పంపారు.

ఆనాటి కార్యక్రమ నిర్వాహకులలో ఒకడనయిన నేను ఈ సందర్భంలో మనోవిశ్లేషణం కొంత చేసికోవలసి ఉంది ఈ ప్రోగ్రాం ఆఫీసర్లు సాహిత్య సంగీతాది వివిధ శాఖలలో విశిష్టజ్ఞానమూ అనుభవమూ బ్రాడ్‌కాస్టింగ్ అనే శబ్దప్రసార కళకు అనువయిన సాంకేతికానుభవమూ, యంత్రపరిజ్ఞానమూ ఆకాశవాణి వంటి కేంద్రప్రభుత్వ సంస్థకు అవసరమయిన పరిపాలనా దక్షతా, అనేక వివరములతో క్లిష్టమయిన కార్య నిర్వాహక సామర్థ్యమూ సంపాదించినవారు. ఏ సాహిత్యంలోనో సంగీతంలోనో కృషి చేసి కృతకృత్యులైనవారు, మధ్యకాలంలో ప్రయోక్తలుగా ఈ సంస్థలోకి రావడ మేమిటి, మేం అమర్చిన దానిలో వారు వేలుపెట్టడ మేమిటి, ఇందులో కార్య

క్రమ ప్రయోగబాధ్యతా, వాటి కీర్త్యపకీర్తులూ ఇన్నాళ్ళు మేమే భరిస్తుండగా దీనిని వేరెవరికో ఎలా ఒప్పచెప్పడం? ప్రయోక్త అంటూ వేరే ఏర్పడినపుడు, దానికి కార్యనిర్వాహక బాధ్యత వహించిన ప్రోగ్రాం ఎగ్జిక్యూటివుదా లేక ప్రయోక్తదా పై చేయి? ఇటువంటి అభిప్రాయ భేదాలు ఆనాడు మాలో లేకపోలేదు. అయితే మా గురువుగారి దగ్గరికి నన్ను పంపడం అనేది ఆనాడు మద్రాసుకేంద్ర అధికారుల సదుద్దేశ పూర్వకమైన తెలివైన యెత్తు అని నేను ఎప్పుడూ అనుకుంటాను.

మరొక రెవరైనా అయితే 'కేంద్ర ప్రభుత్వం మిమ్మల్ని ఈ ఉద్యోగానికి ఆహ్వానించింది. మీ ఆత్మాభిమానానికీ, మీ గొప్పతనానికీ ఇది తగదు' అని చెప్పే వారేమో? ఆయనకే ఎన్నో సందేహాలు వచ్చాయి. అన్నిటికీ నా జవాబు ఒక్కటే— 'మీరు చేరి తీరాలి- సమస్యలూ, సందేహాలూ మీ విశిష్ట వ్యక్తిత్వం వల్ల వాటంతటవే తీరిపోతాయి' అని.

'పరువడము దారి పోవక
పరువును ప్రాభవము చెల్లుబడి సాగింతున్'

అన్న ఆత్మాభిమానం కలవారిని రేడియో ఉద్యోగానికి ఒప్పించడానికి నేను నచ్చచెప్పడంతో ఊరుకోక, ఆయన మా నాన్నగారిని కూడా కలుసుకొని అడిగితే, 'మీరు తప్పక చేరండి, మీరు చేరడం వల్ల రేడియోకే గౌరవం హెచ్చుతుంది' అని చెప్పారు. ఆయన చేరారు. రేడియో కేంద్రం బదిలీ మీద వచ్చి, పోతూ ఉండే అధికారుల కార్యస్థానం. ఎవరు పోయి, ఎవరు వచ్చినా, ఆయన పరువుకూ ప్రాభవానికీ నిరంతరాయంగా చెల్లుబడి సాగిపోతూ ఉండేది. మరిన్ని

'అధికారము మన్నించెద
అధికారిని గుణముబట్టి యారాధింతున్'

అన్నట్లు అధికారులు ఆయన మన్నన పొందుతుండేవారు. ఆయన మాట విజయవాడ, హైదరాబాదులలోనే కాక ఢిల్లీలోకూడా వేదవాక్యంగా శిరసావహింపతగి ఉండేది.

"నాగరిక వృత్తి యెడలిన
వాగర్థంబుల ప్రయోగ వైఖరి యెరుగన్" అనే ప్రతిజ్ఞను ఆకాశవాణిలో అసిధారావ్రతంగా పాలించారు.

"సత్యమొక్కటి. ఆత్మవిశ్వాస మొకటి, కను వెలుంగయి, నాకు మార్గమ్ము చూపె." అనిన్నీ కావ్య రచనలో 'కమలాసను రాణికిన్ ముఖాముఖి నిలుతున్' అనిన్నీ చెప్పుకున్నట్లుగా సారస్వత విషయాలలో అనేక సభలలో శ్రోతృసహస్రానికి వెల్లడియై ఉండిన ఆయన అపరిమితమైన ఆత్మవిశ్వాసమూ కరతలామలకంగా విషయాలను వివరించే అనన్యసాధ్యమైన సామర్థ్యమూ ఆకాశవాణిలో కూడ, ఆయనకి పెద్ద పీటనే వేసి పెట్టింది. అందువల్లనే,- సాహిత్య కార్యక్రమాల ప్రయోక్తృత్వం ఆయన నిర్వహిస్తున్నప్పుడు ఆ శాఖలో - అడ్మినిస్ట్రేటివ్ - కార్యనిర్వహణ క్రియా కలాపమూ, సాంకేతిక యంత్రచాలనమూ, నిర్వహించడానికిన్నీ, ప్రయోక్తృత్వంలో విశిష్ట కార్యక్రమాలు ఆయనకు వదిలివేసి, మిగిలిన - రొటీన్ - దైనిక ప్రసంగ కార్యక్రమాల నిర్వహణకున్నూ మాలో ఎవరో ఒకరము మావంతులను బట్టి తిరిగి తిరిగి వారితో జత పడుతూ ఉండేవారము. వంతునుబట్టి నేను ఏశాఖలో ఉన్నప్పటికీ, ఆయన పనిపడి పిలిస్తే అది అమరవాణి సంస్కృత కార్యక్రమమో, ధ్వని తెలుగు కార్యక్రమమో, సంస్కృత నాటకమో, ఏదైనా వెళ్ళవలసిందే? అది నాకు ప్రత్యేకహక్కు - విధి కాకపోవచ్చు.

సాంప్రదాయకముగా సంస్కృతాంధ్రములలో కృషిచేసి, విద్యాపీఠములలో ఆచార్యులైన పెద్ద పెద్ద పండితులనుకూడా, వారి వారి ప్రసంగములు రేడి

యోకు ఏ విధముగా వ్రాస్తే బాగుంటుందో నచ్చచెప్పడానికి గాని, వివాద విషయాలను సున్నితంగా తప్పించి, సర్వామోదకరంగా ప్రసంగాన్ని దిద్ది తీర్చడానికిగాని, ఆయన చాలా గంభీరంగా తన ప్రయోక్తృత్వాన్ని నిర్వహించేవారు.

'చెంతన్ చేరిన వారనుకొందురు కూరిమి చవిజూచి గంగిగోవు నటంచున్' అని వ్రాసికొన గలగడంలో ఆయన ఎంత గడుసువాడో అని అనుకోమా లేక 'నెమ్మనమిచ్చిన వానిని, నా తనయులతో పాటు శిష్యతతి ప్రేమింతున్' అని శిష్యులపట్లా, కారక్రమ నిర్వహణంలో తనచుట్టూ తన బోధనల ప్రకారం వాచికం నేర్చుకొనడానికి చేరే కళాకారులపట్లా ఆయన అవ్యాజానురాగాన్ని చూసినప్పుడుగాని, రసవత్సన్నివేశముల నిరూపణలో ఆ రూపకం సంస్కృతం కానియ్యండి, తెలుగుది కానియ్యండి, లేదా ఏ నావంటి శిష్యుడో తన హృదయానికి నచ్చినట్లు పాటో పద్యమో, చదివినప్పుడు కానియ్యండి.

సంతోష విషాదమ్ములు
స్వాంతమ్మున నించుకైన నణపగజాలన్
భ్రాంతునివలె బాలునివలె
వింతగ నుప్పొంగి క్రుంగి వేసటపడుదున్-అని

ఆనందబాష్పాలతో అవశతతో కదిలిపోవడం చూసినప్పుడుగాని-ఈ మనిషి ఎంత మెత్తనఅని అనుకోమా? అంత గంభీరుడుగా, కొందరి దృష్టిలో బహుశాసనాధికారియైన 'గర్వి'గా కనబడే ఆయనలో ఇంత నవనీత కోమలత ఏమిటా అని మమ్మల్ని ఆశ్చర్యానందాలలో ముంచేత్తేవారు. సంస్కృత మహాకవుల ప్రసిద్ధ నాటకాలనుండి రేడియో రూపకములకు అనువైన ఘట్టాలను ఏరి, సంభాషణలను రేడియో శ్రోతలఅనుభవానికి సులువుగా అందేవిగాను, పాల్గొనే కళాకారుల వాచికాభినయానికి సులువుగా లొంగేవిగాను, మార్చి కూర్చి, కళాకారులను రోజూ నిర్ణీతకాలానికి రెండు మూడు వారాలు రిహార్సల్సు ఇచ్చి వారిని నిర్దుష్టంగా దిద్ది తీర్చి, తమ ప్రయోక్తృత్వం నిర్వహించేవారు. ఆ తరువాత అయిపోయిన కృషిని గూర్చి "చేయునప్పటి యాస్థచేసిన యనంతరమున నుండదు నాకు కార్యమ్ము పట్ల' అన్నట్లు అనాసక్తత ఉండేది.

ఇలా ఉండగలిగే కళాస్రష్టలు లోకంలో చాలా అరుదు కదా!

ప్రయోక్తలూ, ప్రొడ్యూసర్లు, సలహాదారులూ అనేవారు రాజకీయవాదుల ప్రాపుద్వారా ఆకాశవాణి కేంద్రాలలో ప్రవేశించి, కేవలం పెద్ద పెద్ద వేతనాలు — పింఛనులాగా — పుచ్చుకోవడం తప్ప, పనీ పాటూ చేసే వారు తక్కువనీ, వీరి రాకవల్ల, అంతవరకూ శ్రద్ధగా కార్యనిర్వహణం చేసే ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్‌లు కూడా పనిచెయ్యకుండా పెత్తనం చెయ్య నారంభించారనీ అనేక కేంద్రాలలో విమర్శలు వచ్చాయిగాని, మన తెలుగు కేంద్రాలయిన విజయవాడ, హైదరాబాదులకుగాని అక్కడి సంగీత సాహిత్య సేవాలబ్ధ ప్రతిష్ఠులైన ప్రయోక్తలకు గాని, ఈ విమర్శలు వర్తించక పోగా, ఆచార్య లక్ష్మికాంతముగారి వంటి విశిష్టవ్యక్తుల సాన్నిధ్యంవల్లా ఆదర్శప్రాయమైన కార్యక్రమాలవల్లా, ఆ కేంద్రాలపట్లా, కార్యక్రమాలపట్లా ఇతోధిక గౌరవమే శ్రోతలహృదయాలలో నెలకొన్నదంటే ఎంతమాత్రమూ అతిశయోక్తి కాదు.

ఆయనకు, పరిపాలనా కార్య నిర్వహణంలో సహచరులుగా ఉంటూవచ్చిన ప్రోగ్రాం ఆఫీసర్లు బుచ్చిబాబు, కేశవపంతుల నరసింహశాస్త్రి, నేనూ, శ్రీవాత్సవా, వీరు ఒక్కొక్కరు తమతమ రంగాలలో కృషిచేసి విశిష్టత సంపాదించుకున్నవారూ, ఆయన వంటి ధీశాలితో సాఫీగా పని జరుపుకొని పోగలిగే వారు. వీరికి తోడు ఇతర కార్యక్రమాల ప్రయోక్తలుగా కందుకూరి రామభద్రరావు, వోలేటి, బాలమురళీ

గార్లు, బందావారు, ఏడిదవారు, శ్యామసుందరిగారు, ప్రయాగ ఉండేవారు. ఇందరికీ 'మేస్టారి' మాటంటే ఎంతో గురిగా ఉండేది. కార్యక్రమ ప్రణాళికలు (షెడ్యూల్సు) తయారు చెయ్యడంలో వారికలం ఏనాటికీ తరుగని ఊటబావిలా పనిచేసేది. అష్టావధానాలు, నాట్యావధానాలు వంటి కార్యక్రమాలను పరిచయ పరిచే ప్రసంగాలు చేస్తుంటే, శ్రోతలు మంత్రముగ్ధులై ఆలకించేవారు.

మన కేంద్రాలనుంచి సాహిత్య కార్యక్రమాల ద్వారా తమ విజ్ఞతను ప్రసారం చెయ్యడమేకాక, ఢిల్లీలో ఏటేటా జరిగే జాతీయ కవిసమ్మేళనాలలో, సాహిత్య సమారోహాలలో పాల్గొనడంతో తెలుగు వారికి వారిద్వారా బరువైన ప్రాతినిధ్యం లభించేది.

1967 జనవరి 29 వ తేదీన నూజివీడు ధర్మప్పారావు కళాశాలలో జరిగిన గురుపూజా కార్యక్రమంలో చదివిన నా పద్యాలను కొన్నింటిని ఇక్కడ ఉదాహరించి, గురువుగారి దివ్యస్మృతికి నమోవాకాలతో ఈ వ్యాసాన్ని ముగిస్తాను...

ఎందరో విద్యాగురువరు
లెందరో సాహిత్యమర్మ హితబోధకు లా
యందరిలో లక్ష్మీకాం
తుం దలచి ఘటింతు కేలుదోయిం దలపై.

ఒక్కకవుల జంట నొకరికి పుత్రుండ
నొక్కజంటలోని యొకరి శిష్యు
డగుట రెండు జంటలందున మిగిలిన
తండ్రి, గురుని, భక్తిఁ దలఁతు నెపుడు.

సాంతాభ్యస్త విశిష్ట వాఙ్నిచయులౌ
ఛాత్రుల్, స్వతంత్రుల్, కృత
జ్ఞాంతేవాసులు పూజసేతురు మహో
పాధ్యాయు, సారస్వతా
భ్యం తర్లీన రసప్రసన్నుని, వచో
భావార్థ సంపన్నుడౌ
కాంతున్ మద్గురు నర్ఘ్య పాద్యమణి
ముక్తాపుష్పహారాళితో.

వేలకొలది పత్రంబులు వ్రాలు చేర్చి
గంపలను బండ్ల నింపగాఁ గాదు కైత,
జ్ఞాన దుగ్ధంపు మీగడసార మెత్తు
పల్కు మిన్కుల మలి కవిబ్రహ్మ తానె

ప్రాచ్య ప్రాశ్చాత్య సాహిత్య పద్ధతులను
మేలవించి, విమర్శపథాలఁ జూపె,
ఆంధ్ర వాఙ్మయ చరితంబు నవలనెవరు
చెప్పి, వ్రాసిన నది గురూచ్ఛిష్టమె కద.

భారతాకాశ వాణిలో ప్రభుత మీర
నాంధ్ర గీర్వాణ కావ్యక్రమాళి నడుపు
నవసరాన సహోద్యోగ మాచరించు
కీర్తి తన శిష్యులందు నాకే లభించె.

తిరుపతి వేంకటేశ్వర ను
ధీకృత నాటకరాజియందు మా
గురుడు ప్రధాన భూమికల
గుర్వనురక్తిఁ, బ్రకాస్తి నందడో
సరసత వాయువీధిఁ బటు
సంస్కృత నాటికలందు నన్నుఁ దా
బరవశ మౌనటుల్ బహుళ
భంగుల దీరిచి మోద మందడో.

సభలఁ బరిషత్తులను బృహస్పతి యెవండొ,
కళల, గావ్యప్రశస్తి భార్గవు డెవండొ,
అట్టి శ్రీనాథ చింతనస్వాంతు. విమల
రశ్మిమంతు, లక్ష్మీకాంతుఁ బ్రస్తుతింతు.